పిడుగుపాటుకు నలుగురి మృతి

న్యూస్‌నెట్‌వర్క్, సెప్టెంబర్ 24: తెలంగాణ వ్యాప్తంగా మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. పలుచోట్ల పిడుగులు పడి నలుగురు మృత్యువాతపడగా.. పలువురు గాయపడ్డారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షం కురువగా.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో భారీ వర్షం పడింది. ఖమ్మం నగరంలోని ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో పిడుగుపడి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలం జగ్గారం శివారు బూరుగుగుంపునకు చెందిన కూలీలు కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) మృతి చెందారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం బత్తులపల్లికి చెందిన లక్ష్మయ్య (65) పిడుగుపాటుకు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రంగయ్యపల్లిలో సోమవారం రాత్రి పిడుగుపడి ఎర్రబొజ్జు రాధిక ఇల్లు ధ్వంసమైంది. ఇంట్లో వారు ఊరికి వెళ్లడంతో ప్రాణనష్టం జరగలేదు. సింగూరు ప్రాజెక్టు నుంచి వరద వస్తుండటంతో మెదక్ జిల్లా పాపన్నపేట మండలం ఏడుపాయల వనదుర్గా ప్రాజెక్టు పొంగిపొర్లుతున్నది. దీంతో ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయాన్ని అధికారులు మూసివేశారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటలో పిడుగుపడి పశువుల కాపరి కృష్ణకుమార్ (30) మృతి చెందాడు. వారం రోజులుగా వానలు లేక బీటలు వారుతున్న వరికి ఈ వర్షం ఊరటనిచ్చింది. పత్తి పంట రైతులకు సైతం కలిసొచ్చింది.

బంగాళాఖాతంలో అల్పపీడనం

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కొనసాగుతాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. వరంగల్, నాగర్‌కర్నూల్, నిర్మల్, మహబూబ్‌నగర్, రంగారెడ్డి, నిజామాబాద్, జోగుళాంబ-గద్వాల, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలుకురిశాయి. ఖిల్లా-వరంగల్ మండలంలో 9.67 సెం.మీ. అత్యధిక వర్షపాతం నమోదైంది.

ఎమ్మెల్యే గాంధీపై చర్యలు తథ్యం

- ఆయన అనుచరులపైనా కేసు
- రాష్ట్రంలో మావోయిస్టుల కదలికల్లేవ్
- ఉగ్రవాదుల జాడ కూడా లేదు.. ఉంటే చెప్తాం
- విలేకరుల సమావేశంలో డీజీపీ జితేందర్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ) : ఎమ్మెల్యే అరికెపూడి గాంధీపై చర్యలు తీసుకుంటామని, ఆయన అనుచరులపైనా కేసులు నమోదు చేశామని డీజీపీ జితేందర్ వెల్లడించారు. హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేలు పాడి కౌశిక్ రెడ్డి, గాంధీ వివాదంపై స్పందిస్తూ ఇప్పటికే గాంధీ, ఆయన అనుచరులపై కేసులు నమోదు చేసినట్టు వివరించారు. ఛత్తీస్‌గఢ్‌లో కూంబింగ్ జరుగుతున్నందున తెలంగాణలోకి మావోయిస్టులు వస్తే.. తమ భద్రతా దళాల నుంచి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదని, అవసరమైతే ఎన్‌కౌంటర్లకూ వెనుకాడబోమని స్పష్టంచేశారు. ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర మినహా తెలంగాణలో మావోయిస్టుల కదలికలు లేవని చెప్పారు. హైదరాబాద్‌లో ఉగ్రవాదుల జాడ లేదని తెలిపారు. ఉగ్ర కదలికలపై నిఘా ఉంచామని, సమాచారం ఉంటే తెలియజేస్తామని చెప్పారు. వినాయక నిమజ్జనాల్లో డీజే సిస్టమ్స్ ఉపయోగించొద్దని, వాటివల్ల ఎన్నో అనర్థాలు ఉన్నాయని సూచించారు. చిన్న చిన్న ఘటనలు మినహా వినాయక చవితి, నిమజ్జనాలు, మిలాద్ ఉన్ నబీ కార్యక్రమాలు ప్రశాంతంగా ముగిశాయని చెప్పారు. మొత్తం 5,879 ప్రాంతాల్లో 1,36,638 విగ్రహాలు నిమజ్జనం చేసినట్టు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 15,400 మంది పోలీసులు, 47 ప్లాటూన్స్‌తో విధులు నిర్వర్తించినట్టు చెప్పారు.

జైనూర్ ఘటన దురదృష్టకరం

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన జైనూర్ ఘటన దురదృష్టకరమని డీజీపీ అన్నారు. వెంటనే పరిస్థితిని అంచనా వేసి, 38 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. 720 మంది పోలీసులు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్‌తో జైనూర్ మొత్తం మోహరించామని వివరించారు. లా అండ్ ఆర్డర్ ఏడీజీ, ఐజీతో భద్రతను పర్యవేక్షించామని తెలిపారు. సివిల్ కేసుల్లో తలదూర్చిన చిక్కడపల్లి ఏసీపీపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్ నిందితులకు రెడ్ కార్నర్ నోటీసులు ఇవ్వాలని కోరినట్టు తెలిపారు. దానికి చాలా ప్రాసెస్ ఉంటుందని సీబీఐ, ఇంటర్‌పోల్ సహకారంతో నోటీసులు ఇచ్చే అవకాశం ఉందని చెప్పారు. డప్పు కొట్టకపోతే గ్రామ బహిష్కరణ చేసిన ఘటన తమ దృష్టికి వచ్చిందని, ఆ వెలివేతకు సంబంధించిన వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఏడీజీ మహేశ్ భగవత్, ఐజీలు సత్యనారాయణ, చంద్రశేఖర్‌రెడ్డి, రమేశ్ ఉన్నారు.

ప్రాథమిక బడుల్లో ప్రీ ప్రైమరీ

- బాలవాటిక పేరుతో తరగతులు
- అధికారులను ఆదేశించిన సీఎం
- ప్రత్యేకంగా పాలసీ రూపకల్పన
- అంగన్‌వాడీల పరిస్థితి ఏంటి?

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం సర్కారు బడుల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ వంటి పూర్వ ప్రాథమిక విద్యను ప్రారంభించాలనుకుంటున్నది. బాలవాటిక పేరుతో తరగతులను నిర్వహించడానికి విద్యాశాఖ అధికారులు కసరత్తు తీవ్రతరం చేశారు. రాష్ట్రంలో 18,241 ప్రాథమిక బడులున్నాయి. 3,144 ప్రాథమికోన్నత బడులను పీఎస్‌లలో విలీనం చేయనున్నారు.

ఎన్‌రోల్‌మెంట్‌పై ప్రభావం..

ప్రస్తుతం పూర్వప్రాథమిక విద్యాబోధన అంగన్‌వాడీ కేంద్రాల్లో కొనసాగుతున్నది. సర్కారు బడుల్లో ఒకటో తరగతి నుంచి ప్రవేశాలు కల్పిస్తున్నారు. ప్రైవేట్ బడుల్లో నర్సరీ నుంచే విద్యార్థులను చేర్చుకుంటుండంతో వారు అక్కడే కొనసాగుతున్నారు. ప్రభుత్వ బడుల్లోనూ పూర్వ ప్రాథమిక విద్య ప్రారంభించడం ద్వారా నర్సరీ దశలోనే విద్యార్థులు ప్రభుత్వ స్కూళ్ల బాట పట్టే వీలుంటుందన్న ఆలోచనలో కసరత్తు చేస్తున్నది.

అంగన్‌వాడీలుంటాయా..?

రాష్ట్రంలో 149 ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ల పరిధిలో 35,700 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిల్లో 6.67లక్షల మంది మూడేండ్ల నుంచి ఆరేండ్ల మధ్య వయస్కులు నమోదయ్యారు. కేంద్రం తీసుకొచ్చిన నూతన జాతీయ విద్యావిధానం (ఎన్‌ఈపీ) పూర్వ ప్రాథమిక విద్యను పాఠశాల విద్యలో విలీనం చేయాలని స్పష్టం చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం ఆదిశగా ముందుకెళ్తున్నది. దీంతో అంగన్‌వాడీలు ఉంటాయా..? అన్న చర్చ నడుస్తున్నది. ప్రీ ప్రైమరీ బోధనకు కొత్త టీచర్లను నియమించాలని యోచిస్తుండటంతో అంగన్‌వాడీ టీచర్ల పరిస్థితేమిటన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

డీజీపీ ఆఫీస్ ఎదుట న్యాయం చేయాలని వేడుకుంటున్న బాధిత కుటుంబం

న్యాయమా.. నువ్వెక్కడ!

- తమ బిడ్డ హత్యపై నిగ్గు తేల్చాలని బాధితుల డిమాండ్

హైదరాబాద్, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ): 'అయ్యా నా బిడ్డది రోడ్డు ప్రమాదం కాదు. ముమ్మాటికీ హత్యే. సాక్ష్యాల్లేవని, రోడ్డు ప్రమాదంగా తేల్చి పోలీసులు కేసు మూసేశారు. మరోసారి విచారణ చేపట్టి న్యాయం చేయండి' అంటూ కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బాధిత కుటుంబం జోరువానలో డీజీపీ కార్యాలయం ముందు ఆర్తనాదాలు చేసింది. చొప్పదండి మున్సిపాలిటీకి చెందిన మందా విను జనవరి 22న అనుమానాస్పదంగా చనిపోయాడు. పాతకక్షల నేపథ్యంలో స్నేహితులే మేడారం జాతరకు తీసుకెళ్లి చంపేశారని తల్లి చెప్తున్నది. స్థానిక పోలీసులు డబ్బు తీసుకొని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి కేసు కొట్టివేశారని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై జూలైలో డీజీపీ ఆఫీసులో మొర పెట్టుకోగా.. డబ్బు తీసుకున్న డీఎస్పీ, ఎస్సైకే మళ్లీ విచారణ బాధ్యతలు అప్పగించారని, దీంతో తమకు న్యాయం జరగలేదని ఆవేదనను వెళ్లగక్కారు. నిందితుల్లో కొందరికి కాంగ్రెస్ నాయకుల అండదండలు ఉండటం వల్లే తమకు అన్యాయం చేస్తున్నారని బోరున విలపిస్తూ చెప్పారు. ఈ కేసును రీఓపెన్ చేయించి, ఇంటెలిజెన్స్ పోలీసులతో విచారణ చేయించాలని డిమాండ్ చేస్తున్నారు. మల్టీజోన్-1 ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిని కలిసి తమ గోడు విన్నవించుకున్నారు.

- ఇస్రో చైర్మన్‌కు పుస్తక బహూకరణ

రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ భాషా, సాంస్కృతిక శాఖ, లీజియన్ మళయాలీ అసోసియేషన్, హైదరాబాద్ ఫోరమ్ ఫర్ పొలిటికల్ కార్టూనిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్పేస్ టూస్ పేరిట నిర్వహించిన ఎగ్జిబిషన్‌లో నమస్తే తెలంగాణ కార్టూనిస్ట్ మృత్యుంజయ తన కార్టూన్ల పుస్తకాన్ని ఇస్రో చైర్మన్ డాక్టర్ సోమనాథ్,పర్యాటక, సాంస్కృతిక మంత్రి జూపల్లి కృష్ణారావుకు అందజేశారు.

నేడు, రేపు ఓపెన్ పరీక్ష ఫీజు చెల్లించే చాన్స్

హైదరాబాద్, సెప్టెంబర్ 24(నమస్తే తెలంగాణ): ఓపెన్ స్కూల్ సొసైటీ వార్షిక పరీక్షలకు హాజరయ్యేందుకు అధికారులు మరో అవకాశమిచ్చారు. బుధ, గురువారాల్లో తాత్కాలికంద ఫీజు చెల్లించేందుకు అవకాశమిచ్చినట్టు డైరెక్టర్ సీవీ శ్రీహరి ప్రకటనలో తెలిపారు. పదోతరగతి వారు రూ.500, ఇంటర్మీడియట్ వారు రూ.వెయ్యి ఆలస్య రుసుముతో ఫీజు చెల్లించవచ్చని పేర్కొన్నారు. అక్టోబర్ 3 నుంచి 9వరకు వార్షిక పరీక్షలను నిర్వహించనుండగా, ఈనెల 30న హాల్‌టికెట్లు విడుదల చేస్తామని తెలిపారు.

భూవివాదంలో రాళ్ల దాడి

- రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఘర్షణ
- అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో ఉద్రిక్తత

పెద్దఅంబర్‌పేట, సెప్టెంబర్ 24: ఓ భూమి విషయమై రైతులు, వెంచర్ నిర్వాహకుల మధ్య ఏర్పడిన గొడవ.. రాళ్లు, కర్రల దాడి వరకు వెళ్లింది. ఈ ఘటన మంగళవారం రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పిగ్లీపూర్‌లో చోటుచేసుకుంది. పిగ్లీపూర్‌లోని సర్వే నంబర్ 17లో గోపాల్‌యాదవ్ వెంచర్ ఏర్పాటు చేస్తున్నారు. పలువురు రైతులు వెంచర్‌లోకి వెళ్లి.. ఇందులో సర్కారు పట్టాలు ఇచ్చిన సీలింగ్ భూమి ఉన్నదంటూ ట్రాక్టర్‌తో పనులు చేసేందుకు యత్నించారు. దీన్ని వెంచర్ నిర్వాహకులు, సిబ్బంది అడ్డుకుంటుంటే.. ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఒకరిపై ఒకరు రాళ్లతో దాడి చేసుకోగా పోలీసులు చేరుకుని ఇరువర్గాలను శాంతింపజేశారు. గాయపడ్డ రైతుల్లో పంది ముత్తయ్య, నర్సింహ, ఆకుల సత్యనారాయణ, శంకర్, మరో ఇద్దరు ఉండగా.. వెంచర్ నిర్వాహకుల్లో లోకేశ్, దర్శన్ రెడ్డి, మరొకరు ఉన్నట్టు పోలీసులు తెలిపారు. వనస్థలిపురం ఏసీపీ, అబ్దుల్లాపూర్‌మెట్ సీఐ అంజిరెడ్డి సిబ్బందితో కలిసి ఘటనాస్థలాన్ని పరిశీలించారు. వెంచర్ నిర్వాహకులు సంప్రదింపుల కోసం పిలిచి దాడి చేశారని, కులం పేరుతో దూషించారని రైతులు ఫిర్యాదు చేశారు. వెంచర్‌లోకి చొరబడిన కొందరు స్థానికులు.. వెంచర్ నిర్వాహకులు, సిబ్బందిపై దాడికి దిగారని ఫిర్యాదు చేశారు. పరస్పరం ఫిర్యాదుల మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. కాగా.. పిగ్లీపూర్‌లో తమకు ప్రభుత్వం సీలింగ్ భూములిచ్చి పట్టాలు అందజేసిందని, ఆ భూముల్లోకి జరిగి కొందరు వెంచర్ చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ, హెచ్‌ఎండీఏ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని రైతులు ఆరోపించారు. గతంలో పని చేసిన మండల రెవెన్యూ అధికారి ఇష్టానుసారంగా అనుమతులు ఇచ్చారని విమర్శించారు. వెంచర్ నిర్వాహకులు మాట్లాడుకుందామని పిలిచి, మహిళలు, పెద్ద మనుషులపై సిబ్బందితో దౌర్జన్యంగా రాళ్లు, కర్రలతో దాడిచేయించారని వాపోయారు. మరోవైపు, తమ వెంచర్‌లోని సర్వేనంబర్‌లో ఎలాంటి సీలింగ్ భూమి లేదని నిర్వాహకులు చెప్తున్నారు.

గాయపడ్డ రైతు

పరిసరాల శుభ్రతతోనే వ్యాధులు దూరం

- నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్

దిలావర్‌పూర్ సెప్టెంబర్ 24 : పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతో వ్యాధులు దూరమవుతాయని నిర్మల్ జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండలంలోని కాల్వ గ్రామ పంచాయతీలో పరిధిలోని ఆరోగ్యకేంద్రం సబ్‌సెంటర్‌ను ఆయన సందర్శించారు. మండలంలోని అన్ని గ్రామాల్లోని జీపీ పారిశుధ్య కార్మికులకు వైద్య పరీక్షలు చేయించారు. ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య అందించాలని సూచించారు. స్వచ్ఛతహీ సేవా కార్యక్రమంలో భాగంగా గ్రామంలో పారిశుధ్య పనులను పరిశీలించారు. గ్రామంలో డ్రైనేజీలను శుభ్రంగా ఉంచాలని రక్షిత తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని ఆదేశించారు. అక్కడి నుంచి మండల పరిషత్ కార్యాలయంలో మిషన్ భగీరథ పథకంపై హెల్పర్లకు జరుగుతున్న శిక్షణ తరగతులను పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఎంపీడీవో అరుణారాణి, ఎంపీవో గోవర్ధన్, ఏఈ రాజశేఖర్, పంచాయతీ కార్యదర్శి కిరణ్, కారోబార్ శ్రీనివాస్ రెడ్డి స్థానికులున్నారు.



పంచాయతీ కార్మికులకు వైద్యపరీక్షలు చేయిస్తున్న డీపీవో శ్రీనివాస్

పాటగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలి

బేల, సెప్టెంబర్ 24 : మండలంలోని సాంగ్వి పంచాయతీ పరిధిలోని మీది పాటగూడకు రోడ్డు సౌకర్యం కల్పించాలని, గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజా సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు లంకా రాఘువులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం పాటగూడలో సీపీఎం గ్రామ శాఖ మహాసభలు నిర్వహించారు. ముందుగా జెండా ఆవిష్కరించి అమరులకు నివాళులర్పించారు. గ్రామ నూతన శాఖ కార్యదర్శిగా తొడసం మోతీరాం ఎన్నిక చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు తొడసం భీంరావ్, పూసం సచిన్, ఆత్రం కిష్టన్న, గ్రామ పటేల్ దేవ్ రావ్, గ్రామస్తులు శంభు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

108 సిబ్బంది సేవా భావంతో పనిచేయాలి

ఉట్నూర్, సెప్టెంబర్24 : అత్యవసర పరిస్థితులలో ఉపయోగపడే 108 వాహనాల సిబ్బంది సేవా భావంతో పనిచేయాలని ఆ సంస్థ క్వాలిటీ ఆడిటర్ కిశోర్ అన్నారు. మంగళవారం ఉట్నూర్ డివిజన్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉట్నూర్, ఇంద్రవెల్లి, నార్నూర్, గాదిగూడ మండలాలకు చెందిన 108, 102 అంబులెన్స్ వాహనాల కండిషన్, రికార్డులను పరిశీలించారు. ల్లా ప్రోగ్రాం మేనేజర్ సాయ్రామ్, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజర్ రాజశేఖర్, సిబ్బంది శంకర్, దుత్తు, గణేశ్, రాజశేఖర్, ధరమ్ సింగ్, ప్రవీణ్, అంజన్న, వెంకటేశ్ ఉన్నారు. ముత్నూర్ గ్రామంలో 108,102 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేశారు. సిబ్బంది ఆత్రం ఆశోక్, లఖన్‌సింగ్, విజయ్, కైలాస్, సచిన్, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులు ఎంపిక

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఇంద్రవెల్లి, సెప్టెంబర్24 : ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి కస్తీ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ సొరభం యాదవ్ తెలిపారు. మంగళవారం మండలంలోని పాటగూడ గ్రామంలోని ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని లక్షెట్టిపేట్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే బాలుర పాఠశాలలో ఆదివారం నిర్వహించిన అండర్-19(55కేజీ) విభాగంలో ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలలోని పదో తరగతికి చెందిన విద్యార్థి రాథోడ్ పవన్, (50కేజీ) విభాగంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రాథోడ్ సాయికిరణ్ పోటీల్లో ప్రతిభ కనబరిచి సంగారెడ్డి జిల్లాలోని నారాయణఖేడ్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి కస్తీ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రేఖారాణి, ఉపాధ్యాయులు సరిత, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన క్రీడాకారులకు పతకాలు

క్రీడాకారులతో అధ్యాపకులు

ఉట్నూర్, సెప్టెంబర్ 24 : ఉట్నూర్ ప్రభుత్వ డిగ్రీ గురుకుల బాలికల కళాశాల క్రీడాకారులకు పలు అంశాల్లో పథకాలు సాధించినట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ హరిత, పీడీ అలివేలు మంగ మంగళవారం పేర్కొన్నారు. ఇటీవల కాకతీయ యూనివర్సిటీ ఆధ్వర్యంలో జరిగిన టోర్నమెంట్ మహిళా విభాగంలో చెస్ కాంపిటేషన్‌లో మల్లేశ్వరి, ద్రుపద, రాశికళ, జ్యోతి మొదటి స్థానం కైవసం చేసుకోగా, 10 కిలోమీటర్ రన్నింగ్‌లో లక్ష్మి, భీంబాయి, మహేశ్వరి, లావణ్య, ప్రియాంక, అనిత రెండవ స్థానాలు కైవసం చేసుకున్నారని తెలిపారు. అనంతరం వారిని అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో , అధ్యాపకులున్నారు.

కలెక్టర్, ఎస్పీకి సన్మానం

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : గణేశ్ నవరాత్రుల ఉత్సవాలను విజయవంతంగా పూర్తి చేసుకున్న సందర్భంగా హిందూ సమాజ్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ రాజర్షి షా, జిల్లా ఎస్పీ గౌస్ ఆలం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ సమితి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి బొంపెల్లి హన్మాండ్లు, కోరెడ్డి లెనిన్, సంఘటన మంత్రి ఇత్నుర్ భాస్కర్, కోశాధికారి గందే ఉదయ్‌కుమార్, ఉపాధ్యక్షుడు విశ్వనాథ్, నానందుల రాజ్‌కుమార్, జోగు రమేశ్, సభ్యులు కనక నర్సింగ్ పాల్గొన్నారు.

కలెక్టర్‌ను సన్మానిస్తున్న హిందూ సమాజ్ ఉత్సవ సమితి సభ్యులు

పోటీలు ప్రారంభిస్తున్న ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడీవో నిహారిక

క్రీడా పోటీలతో నాయకత్వ లక్షణాలు

ఎదులాపురం, సెప్టెంబర్24: క్రీడలతో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని, పోటీల్లో ఓడిపోయిన వారు నిరుత్సాహ పడకుండా కఠోర శ్రమతో రాణించాలని ట్రైబల్ వెల్ఫేర్ ఏటీడీవో నిహారిక అన్నారు. మంగళవారం ఆదిలాబాద్ డివిజన్ స్థాయి గిరిజన క్రీడోత్సవాలు ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో నిర్వహించారు. ఇందుకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఇటీవల కోలాం ఆశ్రమ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు హాకీ అకాడమీకి ఎంపికయ్యారని తెలిపారు. గిరిజన క్రీడాల అభివృద్ధి అధికారి పార్థసారథి మాట్లాడుతూ డివిజన్‌లోని ఆశ్రమ పాఠశాలకు చెందిన అండర్ -14, -17 బాల బాలికలకు వేర్వేరుగా బ్యడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్, చెస్, క్యారం, అర్చరీ, టెన్నికాయిట్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన వారిని ఈనెల 27న ఉట్నూర్ లోని కేబీ కాంప్లెక్స్ నిర్వహించే జోనల్ స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ కార్యదర్శి కాంతరావ్, క్రీడల ఇన్‌చార్జి లక్ష్మణ్‌వార్, గోపాల్, రవీందర్, శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు నారాయణరావు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

స్మైల్ సొసైటీ సేవలు అభినందనీయం

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : స్మైల్ సొసైటీ ద్వారా సామాజిక సేవ కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. మంగళవారం స్మైల్ సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ జన్మదినాన్ని పురస్కరించుకొని రిమ్స్ బ్లడ్ బ్యాంక్‌లో మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దాదాపు 30 మంది యువకులు రక్తదానం చేయగా వారిని రిమ్స్ డైరెక్టర్ అభినందించారు. సొసైటీ అధ్వర్యంలో ప్రతి ఆదివారం రోగి సహాయకులకు అన్నదానం చేయడం, రక్తదాన శిబిరాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మరోవైపు కళావతి బ్లడ్ బ్యాంకు కేంద్రంలో సొసైటీ సభ్యులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు మహమ్మద్ రఫీ, సాయిగౌడ్, కిరణ్, విశాల్, సురేశ్, రామకృష్ణ, రాజు, రాకేశ్, శశికాంత్, రాహుల్, రాధాకృష్ణ మోతీలాల్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న సొసైటీ సభ్యులు

బస్ పాసులను సద్వినియోగం చేసుకోవాలి

ఇంద్రవెల్లి, సెప్టెంబర్24 : టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 50 శాతం రాయితీపై అందిస్తున్న బస్ పాసులను దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని దివ్యాంగుల సంఘం జిల్లా కో ఆర్డినేటర్ ప్రమోద్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని సమక ఎక్స్‌రోడ్డు వద్ద గల రాంనగర్‌లో టీఎస్ ఆర్టీసీ ఉట్నూర్ డిపో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దివ్యాంగులకు బస్ పాసుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, ఆర్టీసీ కండక్టర్ ప్రకాష్, దివ్యాంగుల సంఘం నాయకులు సురేశ్, సోన్‌కాంబ్లే దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

చట్టాలను తెలుసుకోవాలి

ఎదులాపురం,సెప్టెంబర్ 24 : భారత దేశంలో రూ.5 వేల వరకు చట్టాలున్నాయని వాటి గురించి తెలుసుకోవడం కష్టమే అయినా అవసరమైన కొన్ని చట్టాలపై విద్యార్థి దశ నుంచే తెలుసుకోవాలని డీఎల్ఎస్ఏ కార్యదర్శి బీ సౌజన్య సూచించారు. మంగళవారం పట్టణంలోని ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయసేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దీనికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చట్టాలలో నిత్యం అవసరమయ్యే వాటి గురించి తెలుసుకోవాలన్నారు. బాలల సంరక్షణ చట్టాలు, బాల్య వివాహాల నిర్మూలన, జువైనల్ జస్టిస్, పోక్సో చట్టాలున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ గంగారాం, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ అర్జుల అశోక్, అసిస్టెంట్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిలర్ ఉమేశ్‌రావు డోలే, పాఠశాల హెచ్ఎం సంతోష్, ఉపాధ్యాయులు అనిల్, శ్రీతల్, ప్రశాంత్ తదితరులున్నారు.

ఎంబీబీఎస్ మొదటి సంవత్సరంలో 90% ఉత్తీర్ణత

ఎదులాపురం, సెప్టెంబర్ 24 : ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం పరీక్షల్లో రిమ్స్ వైద్య కళాశాలలో 90 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు. కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ మంగళవారం సాయంత్రం ఫలితాలు విడుదల చేసిందన్నారు. రిమ్స్ మొదటి సంవత్సరం 121 మంది విద్యార్థులు పరీక్ష రాయగా ఇద్దరు డిస్టింక్షన్‌లో, 49 మంది ఫస్ట్‌క్లాస్, 57 మంది సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణులైనట్లు పేర్కొన్నారు. పరీక్షల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఆయన అభినందించారు. ఎంబీబీఎస్ కోర్సులో విద్యార్థులు మరింత ప్రతిభ కనబర్చాలని సూచించారు.

పడకేసిన పారిశుధ్యం

బేల, సెప్టెంబర్ 24 : డోప్టాల గ్రామంలో పారిశుధ్య పనులు చేయకపోవడంతో ఎటువైపు చూసినా రోడ్లపై మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారు. రాంనగర్ కాలనీలో కాలువలు లేక మురుగు నీరు నిలిచి దోమల వృద్ధి చెందుతున్నాయని దీంతో మలేరియా, డెంగ్యూ తదితర రోగాలు వచ్చే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయతీ అధికారులు తక్షణమే పారిశుధ్య చర్యలు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.